క్లుప్తంగా

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు



గీసుకొండ : టీపీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, స్థానిక మాజీ ఎంపీపీ బీమగాని సౌజన్య, తదితరులు హైదరాబాద్‌లో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మహేశ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎలుకుర్తికి చెందిన నాయకులు పాల్గొన్నారు.

సన్మానం

చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లి హైస్కూల్ బయాలజీ ఉపాధ్యాయుడు సుందర్, లింగాపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు గంగాధర్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన సందర్భంగా తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) ఆధ్వర్యంలో సన్మానించారు. ఆ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో హనుమకొండలో సోమవారం నిర్వహించిన గురుపూజోత్సవ వేడుకల్లో సుందర్, గంగాధర్‌లను సత్కరించారు. ఈ సందర్భంగా సుందర్, గంగాధర్‌లను సంఘం బాధ్యులు పిన్నింటి బాలాజీరావు, తంగళ్లపల్లి రమణయ్య, ఉప్పరపల్లి హైస్కూల్ హెచ్‌ఎం జయ, ఉపాధ్యాయులు సునీత, శశిధర్, సంతోశ్‌కుమార్, భాస్కర్, కిషన్‌సింగ్, శ్రీహరి, తదితరులు అభినందించారు.

ఐఎంఏ దాడులు సరికాదు

నర్సంపేట : గ్రామీణ ప్రాంత ప్రజలకు సత్వరమే వైద్యసేవలు అందించడంలో ముందున్న ఆర్‌ఎంపీ, పీఎంపీలపై ఐఎంఏ దాడులు చేయడం సరికాదని ఎంసీపీఐ(యూ) జిల్లా నాయకుడు కొత్తకొండ రాజమౌళి అన్నారు. పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రులకు పేదల సొమ్మును దోచిపెట్టేందుకే ఐఎంఏ దాడులు చేస్తోందని ఆరోపించారు. దాడులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న దీక్ష



గీసుకొండ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష కొనసాగుతోంది. దీక్ష సోమవారం 16వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కేడల ప్రసాద్, రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి నల్లతీగల రాజయ్య, రజక సంఘం నాయకులు మునుకుంట్ల ఆగయ్య, కత్తెరపెల్లి వేణు, పున్నం వెంకటేశ్, కందుల రవి తదితరులు దీక్షకు సంఘీభావం తెలిపారు.

వర్షంతో కూలిన ఇళ్లు



నెక్కొండ/చెన్నారావుపేట : కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు నెక్కొండ మండలంలోని పనికరలో కమలమ్మకు చెందిన ఇల్లు ఆదివారం రాత్రి కూలిపోయింది. అలాగే చెన్నారావుపేట మండలంలోని చెరువుకొమ్ముతండాకు శివారు వాంకుడోతుతండాకు చెందిన బోడ ఈర్యా ఇంటి గోడ సోమవారం కూలిపోగా బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ నాయకుడు బోడ బద్దునాయక్ పరామర్శించారు. ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లనప్పటికీ ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

పరామర్శ

పర్వతగిరి : మండల కేంద్రానికి చెందిన గ్రేటర్ వరంగల్ మాజీ కార్పొరేటర్ పిన్నింటి దశరథ రామారావు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సోమవారం పరామర్శించారు. తొలుత దశరథ రామారావు చిత్రపటానికి దయాకర్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మోటపోతుల మనోజ్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, బీఆర్‌ఎస్ పార్టీ మండల కన్వీనర్ ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్‌లు చింతపట్ల సోమేశ్వర్‌రావు, గోనె సంపత్, మాజీ ఎంపీటీసీ ఎం.రాజు పాల్గొన్నారు.

బందనపల్లిలో..

రాయపర్తి : మండలంలోని బందనపల్లికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎల్కపల్లి రమేశ్‌ను అతడి తండ్రి సోమయ్య ఇటీవల మృతి చెందిన సందర్భంగా మాజీ మంత్రి దయాకర్‌రావు పరామర్శించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకురాలు భూక్య మంగమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని సైతం దయాకర్‌రావు కలిసి ఓదార్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బిల్లా సుధీర్‌రెడ్డి, జినుగు అనిమిరెడ్డి, రంగు కుమార్‌గౌడ్, పూస మధు, దీప్లానాయక్, తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట : కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సాంబయ్య



నర్సంపేట రూరల్ : ఎంపీడీఓ కార్యాలయంలో..



ఘనంగా కాళోజీ జయంతి

జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, నల్లబెల్లి, నెక్కొండ, ఖానాపురం, చెన్నారావుపేట, దుగ్గొండి, గీసుకొండ, సంగెం, పర్వతగిరి, రాయపర్తి, తదితర మండలాల్లో కాళోజీ 110వ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, కార్యాలయాల్లో, పలు ముఖ్యకూడళ్లలో కాళోజీ విగ్రహాలకు, చిత్రపటాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కాళోజీ పాత్రను కొనియాడారు.

-సాక్షి నెట్‌వర్క్



వర్ధన్నపేట : ఎంపీడీఓ కార్యాలయంలో..



ఖానాపురం : నివాళులర్పిస్తున్న నాయకులు



దుగ్గొండి : ప్రభుత్వ హైస్కూల్‌లో..



చెన్నారావుపేట : పూలమాల వేస్తున్న గోపాల్‌రెడ్డి



పర్వతగిరి : నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ



సంగెం : నివాళులర్పిస్తున్న తహసీల్దార్, ఎస్సై



గీసుకొండ : నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ

ప్రజాకవిగా జనహృదయాల్లో సుస్థిర స్థానం



నర్సంపేట : మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నవీన్



వర్ధన్నపేట : మాట్లాడుతున్న శ్రీధర్ సుమన్

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

నర్సంపేట : కాళోజీ నారాయణరావు ప్రజాకవిగా జనహృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకుని సమాజానికే ఆదర్శప్రాయుడిగా నిలిచారని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మల్లం నవీన్ అన్నారు. ఆ కళాశాలలో సోమవారం కాళోజీ జయంతి, తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి ప్రిన్సిపాల్ నవీన్ పూలమల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఇతర భాషల వెక్కిరింతల నుంచి తెలంగాణా భాష ఆత్మ గౌరవ పరిరక్షణ, తెలంగాణ సంస్కృతి మన్ననకు, అన్యాయానికి గురైన వారికి కాళోజీ చేసిన సాహితీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు సత్యనారాయణ, రజిత, కందాల సత్యనారాయణ, కమలాకర్, రహీముద్దీన్, డాక్టర్ సోమయ్య, డాక్టర్ రాంబాబు, డాక్టర్ రాజీరు, భద్రు, రుద్రాణి, సంధ్య, గాయత్రి, పూర్ణచందర్, తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అభ్యుదయ రచయితల సంఘం, కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో కాళోజీ జయంతి, భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్‌మీడియట్ జిల్లావిద్యాశాఖాధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్ అతిథిగా హాజరై కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పలుకు బడులతో కూడిన భాష కాకుండా బడి పలుకుల భాష ఉండాలని ఆకాంక్షించారు. అరసం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పల్లేరు వీరస్వామి మాట్లాడుతూ ఉద్యమాలే ఊపిరిగా జీవిత ప్రస్థానం సాగించిన మహనీయుడని కాళోజీని కీర్తించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బ్రహ్మాచారి, జిల్లా అధ్యక్షుడు భిక్షపతి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ మార్త శంకర్‌నారాయణ, ప్రిన్సిపాల్ గూళ్ల వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుతో బీజేపీ బలోపేతం



సమావేశంలో మాట్లాడుతున్న కాళీప్రసాద్‌రావు

సంగెం : సభ్యత్వ నమోదుతో బీజేపీ మరింత బలోపేతం కావాలని ఆ పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ కాళీప్రసాద్‌రావు ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని గంగపుత్ర కమ్యూనిటీ హాల్‌లో సభ్యత్వ నమోదుపై సోమవారం నిర్వహించిన వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సుమారు 11 కోట్లకుపైగా సభ్యత్వాలతో ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీగా గుర్తింపు పొందినట్టు తెలిపారు. పార్టీ విధానాలతోనే వికసిత్ భారత్ సాధ్యమవుతుందని చెప్పారు. ఈనెల 13 నుంచి అన్ని బూత్ స్థాయిలో సభ్యత్వ నమోదు చేపట్టాలని సూచించారు. సభ్యత్వాన్ని హక్కుగా భావించాలని కోరారు. కనీసం 200 సభ్యత్వాలు చేయిస్తేనే క్రియాశీలక సభ్యత్వంతోపాటు మండల, జిల్లా స్థాయి పదవులు లభిస్తాయని వివరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పగడాల రాజ్‌కుమార్, సభ్యత్వ నమోదు ఇన్‌చార్జ్ నర్మెట్ట శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు బుట్టి కుమారస్వామి, నాయకులు భూక్య వెంకన్న, బెజ్జంకి శేషాద్రి, ముల్క ప్రసాద్, జక్క చేరాలు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌సెంటర్‌లో మెరుగైన వైద్యసేవలు

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం (సబ్‌సెంటర్)లో గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని డాక్టర్ హుస్సేన్ తెలిపారు. సబ్‌సెంటర్‌లో గర్భిణులకు సోమవారం ఆయన వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ హుస్సేన్ మాట్లాడారు. సబ్‌సెంటర్‌లో నిరంతరం వైద్యులు అందుబాటులో ఉంటారని చెప్పారు. జ్వర పీడితులు, గర్భిణులు, ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులు సబ్‌సెంటర్ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు లలిత, అనిత, ఆశా కార్యకర్తలు తప్పెట లలిత, పెండెం సత్య, వేముల సుజాత తదితరులు పాల్గొన్నారు.

మావో వర్ధంతి

నర్సంపేట : పట్టణంలో మావో 48వ వర్ధంతి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మావో చిత్రపటానికి సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నర్సంపేట డివిజన్ కార్యదర్శి అడ్డూరి రాజు పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో మాస్‌లైన్, ప్రజాసంఘాల డివిజన్ నాయకులు ధార లింగన్న, జవహర్‌లాల్, మనోహరచారి, భద్రన్న, తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట : పట్టణంలో మావో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు అర్శం అశోక్, మైదం పాణి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

సింగతి రాజమల్లు..

దుగ్గొండి : ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో మండలంలోని అడవి రంగాపురంలో సింగతి రాజమల్లు 6వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమల్లు చిత్రపటానికి కేంద్ర కమిటీ సభ్యుడు కుమారస్వామి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్, నాయకులు నాగెల్లి కొమురయ్య, నర్రా ప్రతాప్, కుసుంబ బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చాలని నిరసన

సంగెం : మండలంలోని గాంధీనగర్ వద్ద ఊకల్-తొర్రూరు ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చివేయాలని డిమాండ్ చేస్తూ ఎంసీపీఐ(యూ) మండల ప్రధాన కార్యదర్శి ఇస్మాయిల్ ఆధ్వర్యంలో వాహనచోదకులు, స్థానికులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఇస్మాయిల్ మాట్లాడారు. క్రషర్ నుంచి అధిక లోడ్‌తో వచ్చే వాహనాల వల్లే బీటీ రోడ్డుపై గుంతలు పడ్డాయని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు గోనె రాంచందర్, రౌతు శ్రీనివాస్, జక్క అశోక్, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

రూ.938కే విద్యుత్ కనెక్షన్

వర్ధన్నపేట/పర్వతగిరి : తెల్ల రేషన్ కార్డు కలిగిన వారికి రూ.938కే విద్యుత్ కనెక్షన్ ఇచ్చి మీటర్ అమర్చుతామని విద్యుత్ శాఖ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఏడీఈ)లుకన్న రాజు, చంద్రమౌళి సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. కనెక్షన్ లేకుండా విద్యుత్ వినియోగించడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. విద్యుత్ కనెక్షన్ లేని అర్హులు ఇంటి పన్ను రశీదుతోపాటు ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ జతచేసి రూ.938 లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్, అసిస్టెంట్ లైన్‌మెన్‌లకు అందజేస్తే మీటర్ అమర్చుతారని తెలిపారు. ఈనెల 17వ తేదీ వరకు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుని గృహజ్యోతి పథకాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఆర్‌ఎంపీ వ్యవస్థ నిర్మూలనకు కుట్ర



నర్సంపేట : పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌ఎంపీలు, పీఎంపీలు



దుగ్గొండి : గిర్నిబావిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌ఎంపీలు, పీఎంపీలు

నర్సంపేట : ఆర్‌ఎంపీ, పీఎంపీ వ్యవస్థ నిర్మూలనకు కుట్ర జరుగుతోందని తెలంగాణ, ఏపీ ఆర్‌ఎంపీ, పీఎంపీ సంఘాల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు హరిబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు తాడబోయిన స్వామినాథ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆర్‌ఎంపీలు, పీఎంపీలపై దాడులు చేస్తూ కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సరైన వైద్యసేవలు అందుబాటులో లేకపోవడంతో ఆర్‌ఎంపీ వ్యవస్థ పుట్టిందని చెపాపరు. సీఎంగా వైఎస్.రాజశేఖరరెడ్డి పాలన సాగించిన సమయంలో ప్రభుత్వం ఆర్‌ఎంపీలకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ ఇవ్వడానికి జీఓ నంబర్ 429 విడుదల చేసిందని గుర్తు చేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఆర్‌ఎంపీలను పట్టించుకోలేదని చెప్పారు. జీఓ నంబర్ 429 ప్రకారం ఆర్‌ఎంపీలకు శిక్షణ ఇచ్చి గుర్తింపు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన మేరకు అమలు చేయాలని, దాడులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగంపెల్లి కిరణ్, ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ బండి రమేశ్, ఉపాధ్యక్షులు పెండ్యాల సదానందం, మామిడాకుల రాజిరెడ్డి, పెండ్యాల మధు, మూటపోతుల రవి, ప్రధాన కార్యదర్శి పసరగొండ రమేశ్, సంయుక్త కార్యదర్శి పాలడుగుల జీవన్, కోశాధికారి గజ్జెల్లి రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలోని ప్రధాన రహదారిపై ఆర్‌ఎంపీలు నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ తీరును ఖండించారు. కార్యక్రమంలో ఆర్‌ఎంపీల సంఘం మండల బాధ్యులు, ఆర్‌ఎంపీలు, పీఎంపీలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో 'కోనారెడ్డి' పునరుద్ధరణ



పనులను పర్యవేక్షిస్తున్న సారంగపాణి

వర్ధన్నపేట : స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు చొరవతో మండలంలోని కోనారావుపేట చెరువు పునరుద్ధరణ పనులు సాగుతున్నాయని మాజీ జెడ్పీటీసీ పాలకుర్తి సారంగపాణి తెలిపారు. పనులను సోమవారం ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. కోనారెడ్డి చెరువుకు వచ్చే ఫీడర్ చానల్ కట్ట తెగిపోవడం, కాల్వలో పిచ్చిచెట్లు, మట్టి పేరుకుపోవడంతోపాటు చెరువులోకి నీరు పూర్తి స్థాయిలో రాకపోతుండడంతో రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే నాగరాజు సొంత డబ్బుతో కాల్వలో పేరుకుపోయిన పూటిక తీయించడంతోపాటు చెత్తాచెదారం తొలగించే, ఇతర పనులు చురుకుగా సాగుతున్నాయని చెప్పారు. కట్ట తెగిన, బలహీనంగా ఉన్న చోట మట్టి పోస్తున్నట్టు వివరించారు. ప్రస్తుతం బండౌతపురం వరకు పనులు పూర్తి అయ్యాయని, తెగిన కట్టను పునర్నిర్మించామని చెప్పారు. మిగతా ఐదు కిలోమీటర్ల పనులు మూడు రోజుల్లో పూర్తి కానున్నాయని తెలిపారు. పునరుద్ధరణ పనులతో ఆకేరు ఆక్విడేట్ నుంచి వరద పూర్తిస్థాయిలో కోనారెడ్డి చెరువులోకి చేరుకుంటుండడంతో ఈ ఏడాది చెరువు మత్తడి పోయడం ఖాయమని తెలిపారు.

నేడు మెగా వైద్యశిబిరం

దుగ్గొండి : నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో మండలంలోని వెంకటాపురం గ్రామంలో నేడు (మంగళవారం) మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర (పీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ కిరణ్‌రాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో జ్వర పీడితులు, అనారోగ్యంతో బాధపడుతున్న మండల ప్రజలు వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్యనిపుణులు హాజరై పరీక్షలు నిర్వహించడంతోపాటు వైద్యం అందిస్తారని పేర్కొన్నారు.

వేడుకగా గణపతి నవరాత్రులు



నర్సంపేట : వినాయకుడికి పూజ చేస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్, తదితరులు



సంగెం : రామచంద్రాపురంలో గణపతి విగ్రహం వద్ద సీఐ, ఎస్సై



వర్ధన్నపేట : పూజ చేస్తున్న మల్లేశం, తదితరులు



రాయపర్తి : మైలారంలో..

నర్సంపేట : పట్టణంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. సిద్ధార్థనగర్‌లోని వినాయక విగ్రహం వద్ద స్థానిక ఏసీపీ కిరణ్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆకుల రవి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి, జర్నలిస్ట్ అబ్బు వెంకట్‌రెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వడ్డేపల్లి నర్సింహారావు, సిద్ధార్థ విద్యా సంస్థల చైర్మన్ గోగుల ప్రభాకర్‌రెడ్డి-సృజన, గొల్లపల్లి సదాచారి, వెటర్నరీ డాక్టర్ శ్రీకాంత్, మట్ట మధుసూదన్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, హైమావతి, శోభారాణి, వినోద, సునీత, రజిత, సొనబోయిన సారంగపాణి, రవిచందర్, రాంబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట : పట్టణంలో ఫిరంగిగడ్డ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని మండపానికి కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు రామాచారి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో పూజారి రఘు, బక్కతట్ల రాజు, నిమ్మాని సోమేశ్వర్‌రావు, పూజారి శ్రీనివాస్, పూజారి సురేష్, బొల్లికుంట వెంకటయ్య, లోడ ఐలయ్య, బక్కతట్ల శ్రీనివాస్, నక్క రాజు, తదితరులు పాల్గొన్నారు.

సంగెం : మండలంలోని రామచంద్రాపురంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాన్ని పర్వతగిరి సీఐ రాజగోపాల్, స్థానిక ఎస్సై నరేశ్ సందర్శించి పూజ చేశారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్సై బందోబస్తును పర్యవేక్షించారు. నిర్వాహకులకు సూచనలు అందించారు. గవిచర్లలోని రామలింగేశ్వరస్వామి, సీతారామచంద్రస్వామి ఆలయంలో గూడ లక్ష్మి-వెంకటేశ్వర్లు దంపతులు అన్నదానం చేశారు.

రాయపర్తి : మండలంలోని మైలారంలోని బడికాడి వినాయకుడి దగ్గర ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా గబ్బెట పెద్దబాబు, ఉల్లెంగుల యాదగిరి మాట్లాడారు.

కుట్టుశిక్షణతో మహిళలకు స్వయం ఉపాధి

సంగెం: కుట్టుశిక్షణ ద్వారా మహిళలకు స్వయం ఉపాధి లభిస్తుందని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ వెంకట్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గవిచర్లలో లయన్స్ క్లబ్ ఆఫ్ కనకదుర్గ ఆధ్వర్యంలో మహిళల కోసం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహిళలకు 3 నెలలపాటు ఉచితంగా కుట్టు శిక్షణ నేర్పిస్తామని తెలిపారు. మాజీ ఎంపీటీసీ గూడ సంపత్‌రెడ్డి శిక్షకురాలు జ్యోతిలక్ష్మికి వేతనం చెల్లించడానికి అంగీకరించడం పట్ల వెంకట్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ఫస్ట్ వైస్ డిస్టిక్ గవర్నర్ చంద్రశేఖర్ ఆర్య, రీజియన్ చైర్‌పర్సన్ హరితరెడ్డి, అడ్మినిస్ట్రేటర్ ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాచైతన్యమే వారోత్సవాల ధ్యేయం

నర్సంపేట : ప్రజలను చైతన్యవంతం చేయడమే నేటి (ఈనెల 10) నుంచి 17 వరకు తలపెట్టిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ధ్యేయమని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ అన్నారు. పట్టణంలోని ఓంకార్ భవన్‌లో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొత్తకొండ రాజమౌళి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశానికి రమేశ్ అతిథిగా హాజరై మాట్లాడారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి విముక్తి కోసం సాగిన నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి బీజేపీ మతం రంగు పులుముతూ చరిత్రను వక్రీకరిస్తోందని ఆందోళన వెలిబుచ్చారు. వారోత్సవాల్లో భాగంగా ప్రజలను చైతన్యవంతం చేసే దిశగా ప్రదర్శనలు, కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకురావాలని, పరిష్కారం కాకపోతే పోరాటాలు నిర్మించాలని చెప్పారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం దేశంలోని మతోన్మాద, అవినీతి, అవకాశవాద దోపిడీ పాలనకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమాలకు దిక్సూచిగా నిలవాలని కాంక్షించారు. సమావేశంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు గోనె కుమారస్వామి, జిల్లా సహాయ కార్యదర్శి నర్రా ప్రతాప్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కుసుంబ బాబురావు, వంగల రాగసుధ, నాగెల్లి కొమురయ్య, కన్నం వెంకన్న, కనకం సంధ్య, జిల్లా కమిటీ సభ్యులు సుంచు జగదీశ్వర్, మహ్మద్ రాజాసాహెబ్, ఇస్మాయిల్, సింగతి మల్లికార్జున్, కేశెట్టి సదానదం, జన్ను రమేశ్, నాగేశ్, గాజుల వెంకటయ్య, దామ సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత ప్రభుత్వ స్థలం స్వాధీనం

పర్వతగిరి : మండలంలోని వడ్లకొండలోని (బంజరుదొడ్డి) ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురి కాగా స్వాధీనం చేసుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి సునీల్ తెలిపారు. సదరు స్థలంలో సోమవారం సిబ్బందితో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడారు. గ్రామానికి చెందిన యాకూబ్, పకీర్, ఇబ్రహీం, అబ్బాస్ బంజరుదొడ్డి స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. గ్రామ పంచాయతీ రికార్డుల ఆధారంగా బంజరు దొడ్డి స్థలంగా నిర్ధారించి స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఎస్టీ హాస్టల్‌కు రోడ్డు వేయించాలి

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని రాజుపేట శివారులోని ఎస్టీ కాలేజ్ హాస్టల్‌కు సీసీ రోడ్డు వేయించాలని కోరుతూ విద్యార్థి సంఘాల నాయకులు బొట్ల నరేశ్, జన్ను రమేశ్, గడ్డమీది బాలకృష్ణ ఎంపీడీఓ శ్రీనివాసరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు.